
పరిగిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


వికారాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్


వికారాబాద్ నియోజకవర్గం మర్పల్లి మండల కేంద్రంలో..

# రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

■ ఘనంగా అంబేద్కర్ జయంతి ■ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు ■ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపు

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. తాండూరు పట్టణంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వికారాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పూలమాల వేసి నివాళులర్పించారు.

కొడంగల్ పట్టణంలో కూడలిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పోరేషన చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. పరిగిలోని అంబేద్కర్ విగ్రహానికి , పూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రిజర్వేషన్ల కల్పనతో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, సామా జికంగా, ఆర్థికంగా అవకాశం ఉంటుందని నమ్మి రాజ్యాంగంలో రిజర్వేషన్‌లు చేర్చిన ఘనత అంబేద్కర్‌కు దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరు అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు దేశంలోని ప్రముఖుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలని అన్నారు. రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన హక్కులు ఎంత ముఖ్యమో విధులు కూడా అంతే ముఖ్యమన్నారు.

– న్యూస్‌నెట్‌వర్క్ వికారాబాద్ జిల్లా ఏప్రిల్ 14


తాండూరులో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి..


నవాబుపేటలో బీఆర్ఎస్ నేతలు


దోమలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


కొడంగల్‌లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## ఛలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ



ధారూరు, ఏప్రిల్ 14: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభని విజయవంతం చేయాలని కుక్కింద గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ధారూరు మండల పరిధిలోని కుక్కింద గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఛలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు , నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## పారిశుధ్యం..అస్తవ్యస్తం


కల్‌కోడాలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మర్పల్లి, ఏప్రిల్ 14 : మండలంలోని కల్‌ఖోడా గ్రామంలోని లాల్ నగర్ కాలనీలో పారిశుధ్యం అస్తవ్యసంగా మారింది.. మురుగు కాలువలు లేక నీళ్లు రోడ్డుపై పారడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.. అదే విధంగా పిచ్చి మొక్కలు పెరిగాయని, మురుగు నీరు రోడ్డుపై చేరడంతో ఈగలు దోమలు ఎక్కువై సమీప ఇండ్లలోకి చేరి ఆహారాన్ని కలుషితం చేస్తున్నాయని, దీంతో రోగాల భారినపడే అవకాశం ఉందని కాలనీ వాసులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.. సంబంధిత అధికారులు పిచ్చి మొక్కలు, మురుగు కాలువలు ఏర్పాటు చేయించి పరిశుభ్రమైన వాతవరణం కల్పించాలని కోరుతున్నారు.

## అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంక్


ఉద్దండాపూర్‌లో తాగునీటి ట్యాంకు పాచిపట్టిన దృశ్యం

తాండూరు రూరల్, ఏప్రిల్ 14: తాండూరు మండలం, ఉద్దండా పూర్‌లోని నీటి ట్యాంకులు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. దాంతో తాగు నీరు తాగేందుకు ప్రజలు జంకుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పరిశుభ్రత విషయంలో పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని ఇందిరానగర్‌లోని కాలనీలో తాగునీటి ట్యాంకు పూర్తిగా అపరిశుభ్రంగా మారింది. ట్యాంకు లోపలి భాగంతోపాటు పై భాగం కూడా నాచుపట్టింది. నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకును శుభ్రం చేయాలని కోరినా, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో తాగునీటి కారణంగా అతిసార, దోమలు, ఈగలతో ప్రజలు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. కాలనీలో పైపులైన్ల లీకేజీలు కూడా ఉన్నాయి. మురుగునీరు పైపులైన్ల ద్వారా తాగునీటిలో కలసి పోతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి ట్యాంకును శుభ్రం చేయడంతోపాటు లీకేజీలకు వెంటనే మరమ్మత్తు పనులు చేయించాలని కోరుతున్నారు



ధారూరు, ఏప్రిల్ 14; ధారూరు మండల పరిధిలోని కొండాపూర్‌కలాన్ గ్రామంలో ఎంపీ నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణం పనులను సోమవారం మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్ పరమేశ్, యాదయ్యలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

# నిధులు మంజూరైనా నిర్లక్ష్యమేనా?



వికారాబాద్, ఏప్రిల్ 14 : మండల పరిధిలోని కామారెడ్డిగూడ గ్రామస్తులు కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేస్తూ అవస్థలు పడుతున్నారు. ధన్నారం నుంచి కామారెడ్డిగూడ గ్రామం వరకు దాదాపుగా కిలో మీటర్ ఉంటుంది. గ్రామస్తులకు ఏ చిన్న పని ఉన్న సమీంలో ఉన్న వికారాబాద్ జిల్లా కేంద్రానికి వస్తారు. నిత్యం రాక పోకలు సాగిస్తున్న ప్రజలకు కంకర తేలిన రోడ్డు చూస్తే భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయాలో ఈరోడ్డుపై ప్రయాణిస్తూ ప్రమాదాలు జరి గిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. పూర్తిగా కంకర తేలడంతో బైక్‌లు, ఆటోలు, కార్లు సైతం నడిపేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. 2025 జనవరి 31న ఎంఆర్ఆర్ నిధులు రూ. 80లక్షలతో రోడ్డు పనులకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. పనులు త్వరాగా ప్రారంభిస్తే గ్రామస్తులు సమస్యలు తీరుతాయనే ఆనంద పడ్డారు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంతో ఇంకెన్నాళ్లు ఇబ్బందులు పడాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కామారెడ్డిగూడ గ్రామ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ఇబ్బందికరంగా ప్రయాణం



మా ఊరి వరకు రోడ్డు మంజూరు చేశారు. కానీ నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం జరగడం లేదు. నిత్యం వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు ఈ రోడ్డును చూసి భయాందోళనకు గురవుతున్నారు. రాక పోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయాల్లో ఈ ప్రయాణం చేయాలంటే మరింత ఇబ్బందులు తప్పవు. ఈ రోడ్డుపై ప్రమాదం జరిగితే కాపాడేందుకు కూడా ఎవరు రారు. రోడ్డుకు ఇరువైపులా స్తంభాలకు దీపాలు లేవు.

– చున్నుమియా, కామారెడ్డిగూడ, వికారాబాద్

### వెంటనే పనులు ప్రారంభించాలి



నిధులు మంజూరైన రోడ్డుకు వెంటనే పనులు ప్రారంభించాలి. రోజు రోజుకు ఈ రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం. కంక తేలడంతో ప్రయాణం చేసేందుకు మహిళలు, చిన్నారులు పలు అవస్థలు పడుతు న్నారు. దాదాపు కిలో మీటర్ మేర ఉన్న కంకర రోడ్డును తొలగించి కొత్త రోడ్డు వేయాలి. మరిన్ని ప్రమాదాలు జరుగక ముందే త్వరగా రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలి. అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి.

– సోమిరెడ్డి, కామారెడ్డిగూడ, వికారాబాద్

## పెండ్లి పేరుతో పరిచయం..
# గిఫ్ట్‌పేరుతో చీటింగ్

### మళ్లీ పెరుగుతున్న మ్యాట్రీమోని మోసాలు..

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): మ్యాట్రీమోనీ పేరుతో సైబర్‌నేరగాళ్ల మోసాలు తిరిగి పెరుగుతున్నాయి. ఈ తరహా మోసాలు కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉండి.. ఇటీవల ఎక్కువవుతున్నాయి. మ్యాట్రీమోనీ మోసాలపై గతంలో పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో తగ్గుముఖం పడుతూ ఆగిపోయే స్థితికి వచ్చాయి. అయితే తిరిగి ఈ తరహా నేరాలు పెరగడం ప్రారంభమయ్యాయి. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నామంటూ మ్యా ట్రీమోనీ సైట్ నుంచి పరిచయం కావడం, ఆ తరువాత కొన్నాళ్లు వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుకుంటూ, ఇండియాకు వస్తున్నాను.. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పౌండ్స్, డాలర్లతో వస్తుంటే కస్టమ్స్ పట్టుకున్నారని ఒకరు.. నీ కోసం ఇక్కడ దాచిపెట్టిన సంపద అంతా అక్కడికి పంపించేస్తున్నానని, ఆ సంపద ఎయిర్‌పోర్టులో కస్టమ్స్‌కు పట్టుబడడంతో దానికి డబ్బులు ఇవ్వాలంటూ అందినకాడికి దోచుకోవడం.. ఇలా రక రకాలుగా మాటలు చెబుతూ సైబర్‌నేరగాళ్లు లూటీ చేస్తున్నారు. ఎక్కువగా ఇలాంటి మోసాలు నైజీరియన్ సైబర్ ఛీటర్స్ చేస్తుంటారు. చాలా కేసుల్లో నిందితులు పట్టుబడడం, ప్రజల్లో అవగాహన పెరగడంతో కొన్నాళ్లు ఈ నేరగాళ్లు స్తబ్దుగా ఉన్నారు. అయితే ఇటీవల తిరిగి ఈ మోసాలు చేస్తూ అమాయకులను దోచేస్తున్నారు. ఇటీవల రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి కేసులు రెండు నమోదయ్యాయి.

ప్రైవేట్ ఉద్యోగం చేసే 42 ఏండ్ల మహిళకు షాదీ. కామ్‌లో ఎన్ఆర్ఐ పేరుతో అరుణ్‌కుమార్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇద్దరు కొన్నాళ్లు మాట్లాడుకున్నారు. అరుణ్‌కుమార్ తనకు 8 ఏండ్ల కూతురుందని, తనతో కలిసి ఇండియాకు వస్తుండగా ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారంటూ చెప్పాడు. తనవద్ద 56,000 పౌండ్లు ఉన్నాయని, ఇవి పరిమితికి మించి ఉన్నాయంటూ బ్లాక్ చేశారు, రూ. 5.46 లక్షలు ఐటీ చార్జీ లు కడితే వదిలేస్తామంటున్నారంటూ నమ్మించాడు. బాధితురాలు నమ్మి డబ్బు చెల్లించింది, ఇంకా డబ్బు కావాలంటూ అడగడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ ఉద్యోగం చేసే ఒక మహిళకు డైవర్స్ మ్యాట్రీమోనీ నుంచి అమెరికాలోని న్యూయార్క్ నుంచి రాకేశ్ శర్మ పేరుతో వాట్సాప్‌లో పేరు వచ్చింది. పెండ్లికి సంబంధించిన విషయం మాట్లాడారు. తాను అమెరికాలో న్యూరో సర్జన్ అంటూ నమ్మించాడు. ఇద్దరు పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆ తరువాత తాను ఇండియా కు వస్తున్నానంటూ నమ్మించిన సైబర్ క్రిమినల్... రూట్స్, ట్రావెలింగ్‌కు సంబంధించిన బుకింగ్స్‌కు కావాల్సిన ఖర్చులంటూ కొంత డబ్బు వసూలు చేశాడు. ఆ తరువాత నేను ఇండియాకు రావడం లేదు కానీ, ఇక్కడ సంపాదించిన సొమ్ము అక్కడకు పంపిస్తున్నాను, అందులో డాలర్లు, బంగారు, వజ్రాభరణాలుంటాయంటూ నమ్మించాడు. మరుసటి రోజు అమెరికా నుంచి ఇండియాకు కోట్ల రూపాయల విలువైన వస్తువులు వచ్చి అక్కడ ఎయిర్‌పోర్టులో ఆగిపోయాయి, వాటి కస్టమ్స్ డ్యూటీ చెల్లించి క్లియర్ చేసుకోవాలంటూ రాకేశ్ శర్మ బాధితురాలికి చెప్పడంతో ఆమె ఆ క్లియరెన్స్ కోసం భారీగా డబ్బు పంపించింది. ఇలా సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి రూ. 23.62 లక్షలు పోగొట్టుకుంది. ఇంకా డబ్బు కావాలని అడుగుతుండడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితురాలు రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## గంజాయి దందాకు
# శివారు ప్రాంతాలే అడ్డాలు..!

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): శివారు ప్రాంతాలే లక్ష్యంగా గంజాయి స్మగ్లింగ్ ముఠాలు తమ దందాను కొనసాగిస్తున్నాయి. సరఫరాకు యువతను, కార్మికులను వినియోగించుకుంటున్నారు. ఇక్కడ పోలీసుల నిఘా తక్కువ ఉంటుందనే అక్కడి నుంచి తమ దందాను నడిపిస్తున్నారు. ముఖ్యంగా ఏపీ, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయిని రవాణా చేస్తున్న కొందరు మారుమూల ప్రాంతాలను తమ అడ్డాలుగా చేసుకుంటున్నారు. మరికొన్ని ముఠాలు శివారుల మీదుగా మహారాష్ట్ర, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నాయి. అయితే పోలీసుల నిఘాకు పట్టుబడుతున్నవి కొంతే అని తెలుస్తోంది.. పట్టుబడని గంజాయి, హాషీష్ ఆయిల్ , ఇతర డ్రగ్స్ చాలానే ఉంటుండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గంజాయి రవాణాను ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న సందర్భంగా పోలీసులకు పట్టుబడిన ముఠాలను విచారిస్తే... అప్పటికే రెండు మూడుసార్లు ఇదే రూట్‌లో గంజాయిని సరఫరా చేశామంటూ వెల్లడించిన ఘటనలున్నాయి. పోలీసుల నిఘాతో అప్పుడప్పు డు గంజాయి ముఠాలు పట్టుబడుతున్నాయి. నిఘాకు దొరకకుండా గంజాయి వ్యాపారం చేసే ముఠాలు కూడా ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఔటర్ రింగ్‌రోడ్డుకు అవతల అయితే పోలీసుల నిఘా తక్కువగా ఉంటుందనే భావనతో గంజాయి ముఠాలు అక్కడి నుంచే దందా నడిపిస్తున్నాయని సమాచారం. ఔటర్ రింగ్‌రోడ్డు లోప లి పోలీసుల నిఘా ఉండడంతో పట్టుబడుతామనే భావన స్మగ్లర్లలో ఉంటుంది. అందుకే శివారు ప్రాంతాలను తమ అడ్డాలుగా చేసుకుంటూ.. యు వతను, కార్మికులను గంజాయి రవాణాకు వినియోగించుకుంటున్నారని సమాచారం.

### శివార్ల ప్రాంతాల్లోనే..

ఇటీవల మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు.. భువనగిరి పోలీసులతో కలిసి 4 కిలోల హషీష్ ఆయిల్‌ను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ ముఠా హైదరాబాద్‌తో పాటు పరిసరాల్లో గంజాయిని విక్రయించేందుకు ఏపీ, నర్సీపట్నంకు చెందిన పేట్ల శేఖర్, అతని స్నేహితుడు అన్నిరెడ్డిలు గంజా దుర్గా అనే ప్రధాన డ్రగ్ విక్రేత వద్ద నుంచి హషీష్ ఆయిల్ తీసుకొని హైదరాబాద్‌కు బయలుదేరి, భువనగిరిలో పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ ముఠా ప్రధానంగా శివార్లలోనే విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అన్నిరెడ్డి వృత్తిరీత్యా లారీ డ్రైవర్ కావడంతో పాటు శివారు ప్రాంతాలపై అవగాహన ఉంది. దీంతో ఇంజినీరింగ్, ఇతర పీజీ కాలేజీలు ఎక్కువగా ఉన్న చోట, ఆ పరిసర ప్రాంతాల్లో యువత కూడా ఎక్కువగానే ఉంటుంది, దీంతో పాటు ఎక్కువగా కార్మికులు ఉన్న చోట కూడా గిరాకీ ఉండే అవకాశాలుంటాయని భావించిన ఈ ముఠా శివారు ప్రాంతాలను ఎంచుకొని ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. కొత్తగా వచ్చే ముఠాలు మొదట శివారు ప్రాంతాల్లో ఒకటి రెండు సార్లు డెలివరీ చేసిన తరువాత.. సిటీలోకి ఎంట్రీ అవుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి గంజాయిని సరఫరా చేస్తుంటారు.

### రాష్ట్రాలు దాటేస్తుంటాయి..

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు గంజాయి తెచ్చి ఇచ్చే బాధ్యతను కొన్ని ముఠాలకు అక్కడి డ్రగ్ విక్రయ ముఠాలు అప్పగిస్తుంటాయి. దీంతో ఆయా రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ను అక్రమ రవాణా చేసేందుకు ఈ ముఠాలు రంగంలోకి దిగుతుంటాయి. ఏపీ, ఒడిశాలలో గంజాయి విక్రేతలతో మాట్లాడి గంజాయి, హషీష్ ఆయిల్‌ను రవాణా చేస్తుంటాయి. పోలీ సుల నిఘా నుంచి తప్పించుకోవడం కోసం కొందరు లారీలు, వ్యాన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుండగా, మరికొందరు గంజాయి ఉండే వాహనానికి ముందు, వెనుక పైలెట్‌లా వ్యవహరిస్తుంటారు. మరికొందరు మరో అడుగు ముందుకేసి ఎవరి ప్రమేయం లేకుండా డ్రైవర్ సోలోగా వాహనాన్ని నడుపుతూ అనుకున్న చోటకు గంజాయిని చేర్చేందుకు ప్రయత్నించిన ఒకరు ఇటీవల మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులకు 300 కిలోల గంజాయితో పట్టుబడ్డాడు. పట్టుబడ్డ నిందితుడు అహ్మద్ గులాబ్ షేక్ గతంలోను రెండు సార్లు 450 కిలోల గంజాయి రవాణా చేసి సక్సెస్ అయ్యాడు. మూడో సారి పోలీసులకు పట్టుబడ్డాడు. ఇలా పోలీసుల కండ్లుగప్పి గంజాయి రవాణా జరుగుతున్నది ఎక్కువగానే ఉంటుందని సమాచారం.

## టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమంట్‌ను ప్రారంభిస్తున్న రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ

పెద్దేముల్, ఏప్రిల్ 14: మండల పరిధిలోని తట్టేపల్లి గ్రామంలో మొగుల్ చంద్ర గ్రూప్ అధినేత ప్రభు కుమార్ అధ్యక్షతన వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం తట్టేపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్న మెంట్‌ను, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మధుసూదన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మారుమూల గ్రామా ల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా పల్లెలోని యువ కుల ప్రతిభ బయట పడుతుందని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి సాధించిన వారికి రూ. 30వేలు, కప్ అందజేయనున్నారు. ప్రతి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఉం టుందని ఈ టోర్నమెంట్ మొత్తంలో 22 క్రికెట్ జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ బీసీ నేత రాజ్‌కుమార్, రాజప్ప గౌడ్, శంకర్, అంజప్ప, నారాయణగౌడ్, డీలర్ అంజిలప్ప, కొహిర్ రాజు, చంద్రప్ప, వెంకటేశ్, సుకూర్ భాయ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి

కులకచర్ల, ఏప్రిల్ 14 : పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందిన సంఘటన చౌడాపూర్ మండల పరిధిలోని బొ్రహ్మ్యానాయక్‌తండా గ్రామ పంచాయతీ టాక్ర్యనాయక్‌తండాలో సోమవారం జరిగింది. టాక్ర్యనాయక్‌తండాకు చెందిన మూడావత్ పార్వతమ్మకు చెందిన రెండు ఆవులు పిడుగుపాటుతో మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. చెట్టుకింద కట్టేసిన పాడి ఆవులపై పిడుగు పడి మృతి చెందాయని తెలిపారు. ఆవుల ద్వారా జీవనోపాధి పొందుతున్న పార్వతమ్మకు రెండు ఆవులు పిడుగు పాటుకు గురికావడంతో ఇబ్బందుల్లో పడిందని గ్రామస్తులు తెలిపారు. సుమారు లక్షల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతుంది.

అలాగే కులకచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులు రావడంతో కొబ్బరి చెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగినట్లు గ్రామస్తులు తెలిపారు.

### మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

కులకచర్ల, ఏప్రిల్ 14 : కులకచర్ల మండల కేంద్రానికి చెందిన గుడాల వెంకటయ్య టీచర్ భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం వారి ఇంటికి వెళ్లిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు. తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పీరంపల్లి రాజు, మాలె కృష్ణయ్యగౌడ్, మాలెల వెంకటయ్య, కడంపల్లి రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సాయం

దోమ, ఏప్రిల్ 14: మండల పరిధిలోని అయినాపూర్ గ్రామానికి చెందిన ఏర్పుమల్ల పెద్ద అంజిలయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. గ్రామ యువకుడు భాస్కర్‌గౌడ్ అంజిలయ్య కుటుంబ సభ్యులను పరమార్శించి ఆయన అంత్యక్రియలకు గాను రూ. ఐదువేలు అందజేశాడు. కార్యక్రమంలో పాలేపల్లి వెంకటయ్య, అంజిలయ్య, నల్ల రాజు, గుడ్ల రాములు, సాయిలు, నర్సింహులు, ఎర్ర శీను, కృష్ణయ్య పాల్గొన్నారు.

# సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య

### స్నేహితుడి మోసమే కారణమా..?

వెంగళరావునగర్, ఏప్రిల్ 14: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఈ ఘటన ఎస్ ఆర్.నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నాగ్‌పూర్‌కు చెందిన శివానీ, రుడాల్ఫ్ ఆంటోని(31) లు 2022 లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఉద్యోగ రీత్యా 2023లో హైదరాబాద్‌కు వచ్చి అమీర్ పేట డీకే రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో భార్య కూడా ఉద్యోగం చేస్తే బాగుంటుందని భావించాడు. భార్యకు ఉద్యోగం ఇప్పిస్తానని అల్వాల్ లో ఉండే స్నేహితుడు ..ఆంటోనీ నుంచి రూ.4.50 లక్షలు వసూలు చేశాడు. కాలం గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో తన డబ్బు తిరిగి ఇచ్చేయాలని ఆదివారం రాత్రి అల్వాల్ లో ఉండే స్నేహితుడి ఇంటికి వెళ్లి గొడవ పడినట్లు సమాచారం. కష్టపడి కూడబెట్టిన డబ్బు స్నేహితుడు మోసం చేసి కాజేశాడని దిగులు చెందేవాడు. ఆదివారం రాత్రి 10.30 ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చి గదిలో కి వెళ్లి ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంతసేపటికీ తలుపులు తీయకపోవడంతో భార్య శివానీ.. స్నేహితుల సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఆంటోని వేలాడుతూ కనిపించాడు.. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### వెస్ట్ శ్రీనివాసనగర్ లో వ్యక్తి ..

వెంగళరావునగర్, ఏప్రిల్ 14 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెస్ట్ శ్రీనివాసనగర్ లో నివాసం ఉంటున్న కె.సునీల్(45) ఓ హోటల్ లో మేనేజర్ గా పని చేసేవాడు. అతని భార్య సంధ్యారాణి ప్రభుత్వ దవాఖానలో నర్సుగా పనిచేస్తుంది. ఇటీవల ఖమ్మంకు బదిలీ కావడంతో ఆమె.. ఇద్దరు పిల్లలను తీసుకుని అక్కడికి వెళ్లింది, అయితే ఆదివారం భర్తకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో భర్త స్నేహితుడు సురేశ్‌కు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే అతను ఇంటికి వెళ్లి చూసేసరికి ఫ్యాన్ కు వేలాడుతూ సునీల్ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.